

డిగ్రీ.. నో డిమాండ్
కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సీట్లు సగానికి పైగానే ఖాళీగా ఉన్నాయి.
- 8లో▸



వైభవంగా పొట్ట పండుగ
ఫిబ్రవరిలో జరిగిన సమ్మక్క-సారలమ్మ మహాజాతర అనంతరం ఆరు నెలల తర్వాత అమ్మవార్ల పొట్టపండుగను ఆదివాసీలు వైభవంగా నిర్వహించారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి: సీపీ



వరంగల్ క్రైం: క్రీడల్లో రాణిస్తున్న పిల్లలను, వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గత నెలలో రాజస్థాన్‌లో జరిగిన 7వ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో వరంగల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ భిక్షపతి కుమారులు కట్ల ధీరజ్‌సాయి మిక్స్‌డ్ విభాగంలో రజత పతకం, కట్ల వేదాంశ్ ఫ్రీ స్టైల్ విభాగంలో స్వర్ణ పతకం గెలుపొందారు. థాయిలాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించారు. ఈసందర్భంగా పతకాలు సాధించిన ధీరజ్‌సాయి, వేదాంశ్‌కు బుధవారం సీపీ పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగాలను సాధించడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఆర్ఐ స్పర్జన్‌రాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్, తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం పెంచేందుకే అవార్డులు

హన్మకొండ: ఉద్యోగుల్లో స్నేహపూర్వక పోటీతత్వాన్ని పెంచేందుకు ఏప్రిల్ నుంచి ప్రతీ నెల బెస్ట్ ఫర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్ అవార్డులు ఇస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. ఏప్రిల్ నుంచి అవార్డులు అందిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పారామీటర్లలో అధికారులు, ఉద్యోగులు కనబర్చిన పనితీరు ఆధారంగా ఉత్తమ అధికారి, ఉద్యోగులను సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్ అవార్డులు ప్రకటిస్తున్నారని తెలిపారు. అవార్డులు పొందిన అధికారులు, ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా వారు సైతం పనితీరును మెరుగుపర్చుకుంటారని పేర్కొన్నారు. అంతిమంగా వినియోగదారులకు మెరుగైన సేవలందుతాయని తెలిపారు.

కేయూ మహిళా పీజీ విద్యార్థులకు ర్యాంకులు



ఎం.స్నేహ జె.రేవతి డి.అలేఖ్య

కేయూ క్యాంపస్: కేయూ పరిధి హనుమకొండలోని సుబేదారి మహిళా పీజీ కళాశాలలో 2021-23 సంవత్సరానికి సంబంధించి యూనివర్సిటీ స్థాయిలో మూడు విభాగాల్లో ముగ్గురు మొదటి ర్యాంకు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుశ్రీ బుధవారం తెలిపారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో వర్సిటీ స్థాయిలో ఎం.స్నేహ, మొదటి ర్యాంకు, ఎంకాంలో జె.రేవతి మొదటి ర్యాంకు, ఎంబీఏలో డి.అలేఖ్య మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌నకు టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకంలో భాగంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. depwd.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పోస్ట్‌మెట్రిక్ కాలేజీ వసతి గృహం ప్రారంభం



హన్మకొండ: హనుమకొండ అశోక కాలనీలో నూతనంగా నిర్మించిన గిరిజన పోస్ట్‌మెట్రిక్ కాలేజీ బాలుర వసతి గృహాన్ని బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ బీఎస్‌సీ నిధులు రూ.2.15 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ వసతి గృహం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళ, కార్పొరేటర్ నల్ల స్వరూపారాణి, నాయకులు బంక సరళ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ (ఆఫీసర్స్) క్లబ్‌లో భారీ కుంభకోణం

- సభ్యత్వ రుసుముకు లెక్కల్లేవు.. ఉచితంగా వేసిన రోడ్డుకు చెల్లింపులు
- స్విమ్మింగ్ పూల్, బార్ నిర్వహణ, గదుల కేటాయింపులోనూ అక్రమాలు
- త్రిమెన్ కమిటీ విచారణలో వెలుగులోకి..
- గత మూడు పాలకవర్గాల హయాంలో జరిగినట్లు గుర్తింపు



హన్మకొండ:

వరంగల్ (ఆఫీసర్స్) క్లబ్‌లో భారీ కుంభకోణం జరిగింది. గత మూడు పాలకవర్గాల హయాంలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగింది. సభ్యత్వ రుసుం, స్విమ్మింగ్ పూల్, బార్, గదుల కేటాయింపులు కలుపుకుని దాదాపుగా రూ.4కోట్ల మేరకు నిధులు దుర్వినియోగమైనట్లు ప్రస్తుత పాలకవర్గం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. ఆఫీసర్స్ క్లబ్‌లోని బార్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా చేసిన ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుత పాలకవర్గం సభ్యత్వ జారీ, రుసుం చెల్లింపులు జరిగిన తీరుపై దృష్టి సారించి.. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేసిన అనుభవమున్న న్యాయవాదితో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ వేసి విచారణ చేపట్టింది. ఈ విచారణలో అక్రమాలు వెలుగు చూశాయి.

కలెక్టర్‌కు వినతి

నోటీసులు అందుకున్న సభ్యులు బుధవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను కలిసి క్లబ్‌లో జరిగిన అక్రమాలు, సభ్యత్వ రుసుం చెల్లింపు చేయలేదని జారీ చేసిన నోటీసుల అంశాన్ని వివరించారు. ఇప్పటికే సభ్యత్వ రుసుం చెల్లించినందున మరోసారి చెల్లించలేమని, తమను సభ్యులుగా కొనసాగించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అదే విధంగా క్లబ్ కార్యదర్శి రవీందర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. తాము సభ్యులం కాకపోతే తాము వేసిన ఓట్లతో గెలిచిన పాలకవర్గ సభ్యుల ఎన్నిక చెల్లదని, వారు రాజీనామా చేయాలని నోటీస్ అందుకున్న సభ్యులు డిమాండ్ చేశారు.

మరికొన్ని అక్రమాలు..

- క్లబ్ ఆవరణతోపాటు, క్లబ్‌కు వచ్చే దారిని తారు రోడ్డుగా దాత నిర్మిస్తే ఆ బిల్లు కూడా గత పాలకవర్గం చెల్లింపులు చేసిందని గుర్తించారు.
- స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే ఆదాయం, బార్, గదులు అద్దెకు ఇవ్వడంలో వచ్చే ఆదాయంలోనూ అవకతవకలు జరిగినట్లు ముగ్గురు సభ్యుల కమిటీ గుర్తించింది.
- 2016 సంవత్సరం నాటి ఫైల్ మాయమైనట్లు సమాచారం.



ప్రస్తుత వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నోటీసులు అందుకున్న సభ్యులు



రికార్డుల్లోకెక్కని సభ్యత్వ రుసుములు

వరంగల్ ఆఫీసర్స్ క్లబ్‌లో 1200మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరిలో గత పాలకవర్గాల హయాంలో సభ్యత్వం తీసుకున్న 164 మంది రుసుం వివరాలు రికార్డుల్లోకి ఎక్కలేదు. దీంతో వారి జాబితాను ఇటీవల ప్రస్తుత కార్యవర్గం నోటీసు బోర్డుపై ప్రదర్శించింది. కొందరు సభ్యులు తమ వద్ద ఉన్న రశీదులు చూపెట్టడంతో వారి పేర్లను తొలగించారు. మిగతా 150 మందికి క్లబ్ పాలకవర్గం నోటీసులు జారీ చేసింది. త్వరలో సభ్యత్వ రుసుం చెల్లించాలని నోటీసులో పేర్కొంది. తాము సభ్యత్వం తీసుకున్నప్పుడే రుసుం చెల్లించామని, మరోసారి ఎలా చెల్లిస్తామని వీరు ప్రశ్నిస్తున్నారు. రూ.3 లక్షల సభ్యత్వ రుసుముకు రూ.2లక్షలు, రూ.1.50లక్షలు చెల్లించామని, ఇక్కడే అక్రమాలకు దారి తీసిందని ప్రస్తుత పాలకవర్గం పేర్కొంటుంది. 150 మందిలో 20 మంది వరకు రూ.3 లక్షల చొప్పున, 40 మంది రూ.2 లక్షల వరకు, 40 మంది రూ.1.50 లక్షల వరకు చెల్లించినట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో సభ్యత్వం పొందిన వారున్నారు. వీరందరి డబ్బులను స్వాహా చేసినట్లు చెబుతున్నారు.

అక్రమాలు జరిగింది వాస్తవమే..



వరంగల్ క్లబ్ గత పాలకవర్గాల హయాంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగం జరిగింది వాస్తవమే. దీనిపై సమగ్రంగా పరిశీలిస్తున్నాం. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిని గుర్తించి వారి నుంచి రికవరీ చేయాలనే ఆలోచనలో ఉన్నాం.

- రవీందర్ రెడ్డి, క్లబ్ సెక్రటరీ

కుంభకోణం జరిగింది..



వరంగల్ క్లబ్‌లో పెద్దఎత్తున కుంభకోణం జరిగింది. రూ.కోట్లలో నిధులు దుర్వినియోగం చేశారు. సభ్యత్వ రుసుంతో పాటు క్లబ్‌కు ఇతర రూపంలో వచ్చే ఆదాయంలోనూ అక్రమాలు జరిగాయి. 2016 నాటి ఫైల్ మాయమైంది.

- విజయ్ కుమార్, సభ్యుడు

సభ్యత్వ రుసుం చెల్లించినా.. చెల్లించలేదంటున్నారు..



నేను రూ.1.50 లక్షలు క్లబ్ మేనేజర్‌కు చెల్లించి సభ్యత్వం తీసుకున్నా. గుర్తింపు కార్డు జారీ చేశారు. ఐదేళ్ల తర్వాత సభ్యత్వ రుసుము చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని నోటీసు జారీ చేశారు.

- బైరి యాదవ రెడ్డి, సభ్యుడు

మిస్ గార్జియస్ ఆఫ్ ఇండియాగా దీక్షిత



రామన్నపేట: మిస్ గార్జియస్ ఆఫ్ ఇండియా సీజన్-4 పీపుల్ చాయిస్ విన్నర్‌గా వరంగల్ నగరం దేశాయిపేటకు చెందిన దొనికెన దీక్షిత నిలిచింది. హైదరాబాద్‌లోని మాంటీ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మిస్టర్ అండ్ మిస్ గార్జియస్ ఆఫ్ ఇండియా సీజన్-4 పోటీల్లో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన సుమారు 80 మందికి పైగా మేల్ అండ్ ఫీమేల్ కేటగిరీల్లో పాల్గొన్నారు. ఇందులో అందం, ప్రతిభ కలిగిన వారిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. కాగా.. వీరిలో పీపుల్స్ చాయిస్ టైటిల్ విన్నర్‌గా దీక్షిత నిలిచింది. దీక్షిత కుటుంబం దేశాయిపేటలోని లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో నివాసం ఉంటోంది. బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చదివిన దీక్షిత ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్‌గా కాగ్నిజెంట్ కంపెనీలో పని చేస్తోంది. ఆమె చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌లో ప్రావీణ్యం సంపాదించింది.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలా వరంగల్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమష్టిగా పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వారం రోజుల్లో 100 దరఖాస్తులు పరిశీలించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏపీఓ రామా రవీందర్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి రత్నకుమారి, ఎల్ఆర్ఎస్ సెక్షన్స్ సూపరింటెండెంట్ రంజిత్, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి తనిఖీ

కాశిబుగ్గ/వరంగల్: కాశిబుగ్గ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. అదేవిధంగా వరంగల్ డీఎంహెచ్ఓ కాజీపేట వెంకటరమణ కాశిబుగ్గ, దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు.

భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలి

ఖిలా వరంగల్: రాష్ట్ర, జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనతో కలిసి ఆయన కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. పరకాల ఎమ్మెల్యే, అధికారులతో కలిసి మరోసారి రైతులతో చర్చించి భూసేకరణ పూరిచేస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్లు, పర్యవేక్షకులు పాల్గొన్నారు

ఆడపిల్లలకు మనోధైర్యం కల్పించాలి

ఆడపిల్లలకు మనోధైర్యం కల్పించాలని మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశించారు. డీఆర్‌డీఓ కార్యాలయంలో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహిస్తున్న టీఓటీ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి బుధవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది బయోమెట్రిక్ యంత్రాల ద్వారా హాజరు నమోదు చేసుకుని ఆ వివరాల్ని గ్రూపులో అప్‌లోడ్ చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆస్పత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారులు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో దవాఖానాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఇందులో కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతీ ఆస్పత్రిలో బెడ్లు, వార్డులకు నంబర్లు వేసి పేషెంట్ల వివరాల్ని ఆస్పత్రి ఎదుట బోర్డులపై ప్రదర్శించాలన్నారు. తాగునీరు, శానిటేషన్, విద్యుత్, జనరేటర్లు, ప్లంబింగ్, డీజిల్ వాడకానికి సంబంధించిన రిజిస్టర్లను నిర్వహించాలని, వాటిని ఆస్పత్రి సూపరింటెండెంట్లు రోజూ లేదా రెండ్రోజులకోసారి తనిఖీ చేయాలన్నారు. వార్డుల్లోని లైట్లు, ఫ్యాన్లు, ఇతర మరమ్మతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే నిధులు సక్రమంగా వినియోగించాలని, మంజూరైన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీబీ ఆస్పత్రికి అంబులెన్స్ కోసం ప్రతిపాదనలు పంపించాల్సిందిగా కోరారు. ఏమైనా సమస్యలుంటే తెలపాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు నారాయణ, వెంకటేశ్ డీఎంహెచ్ఓ లలితాదేవి, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

భూసేకరణ కొనసాగుతోంది..

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆర్అండ్‌బీ సెక్రటరీ దాసరి హరిచందన, అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఈసమావేశానికి హాజరైన కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు 1,195 మంది రైతుల నుంచి 141 హెక్టార్ల భూమిని గుర్తించినట్లు, దీనిలో 118 హెక్టార్ల భూమి సేకరించి నేషనల్ హైవే అథారిటీ ఇచ్చినట్లు తెలిపారు. 23 హెక్టార్ల భూమికి సంబంధించి రెండు కేసులు కోర్టులో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓలు వెంకటేశ్, నారాయణ పాల్గొన్నారు.



'జస్టిస్ ఫర్ అభయ'

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం వైద్యవిద్యార్థులు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రధాన గేటు ఎదుట కొవ్వొత్తులతో 'జస్టిస్ ఫర్ అభయ' ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. - ఎంజీఎం

రుణమాఫీపై నేడు బీఆర్ఎస్ ధర్నా

పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

హన్మకొండ: రుణమాఫీ కోసం రణం చేయనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఇందులో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పిలుపు మేరకు ఈనెల 22న(గురువారం) హనుమకొండ బాలసముద్రంలోని జయశంకర్ స్మృతి వనం వద్ద రైతు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి ఎన్నికల్లో లబ్ధి పొందిన కాంగ్రెస్ నేడు కొంత మంది రైతులకు రుణమాఫీ చేసి ఇతర రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో గురువారం జరిగే ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, నాయకులు తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, పులి రజనీకాంత్, మసూద్, చింతల యాదగిరి పాల్గొన్నారు.

పన్ను వసూలు చేయని ఆఫీసర్లెందుకు?

- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- అధికారులతో సమీక్ష



చింతగట్టులో స్థలాలు పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: 'వార్డు ఆఫీసర్లు మీ విధులేంటో తెలుసా? నయా పైసా పన్నులు వసూలు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారా' అంటూ గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో పన్నుల విభాగాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ ఆస్తి, నీటి, చెత్త పన్నుల వసూళ్లపై సమీక్షించారు. ఈసంవత్సరం కేవలం 30.12శాతం పన్నులు వసూలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. 15 మంది వార్డు ఆఫీసర్లను హెచ్చరించారు.

యుద్ధప్రాతిపదికన యూనిట్లు కల్పించాలి

స్వయం సహాయక మహిళా బృందాలకు యుద్ధ ప్రాతిపదికన ఉపాధి యూనిట్ల అమలుకు చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లతో (సీఓ)లతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, ఉపాధి యూనిట్లు, బ్యాంకు రుణాల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

భూ క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం కాజీపేట సర్కిల్ పరిధి చింతగట్టు, భీమారం ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక, ఇరిగేషన్ విభాగాల అధికారులు, సిబ్బందితో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి స్థలాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, టీపీఆర్ఓ కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, టీఎంసీ రమేశ్, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీంద్రరెడ్డి, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఈర్షద్, ఆర్వోలు యూసుఫొద్దీన్, శ్రీనివాస్, సుదర్శన్, షెహజాదీ బేగం, సీఓలు సకినాల రమేశ్, శ్రీలత, రాజ్ కుమార్, స్వాతి, సునీల్, రజిత, అలీ తదితరులు పాల్గొన్నారు.

మీ ఓపెన్ ప్లాట్ ఎక్కడో చెప్పండి?

- ఎల్ఆర్ఎస్ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సిబ్బందికి తిప్పలు
- ఎగ్జాక్ట్ లొకేషన్ దొరక్క దరఖాస్తుదారులకు ఫోన్లు
- ఇంకొన్ని చోట్ల చెట్ల పొదలతో కొలతలకు అవస్థలు
- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వింత పరిస్థితి



గవిచర్ల క్రాస్‌రోడ్ నుంచి సంగెం వరకు ఓ వెంచర్‌లో తుమ్మచెట్లతో నిండిన ఎల్ఆర్ఎస్ ప్లాట్లు

సాక్షి, వరంగల్: లేఔట్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)కు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్న వారు...ఇప్పుడు సర్కార్ క్లియర్ చేస్తామని ముందుకొచ్చినా ఆ స్థాయి ఉత్సాహాన్ని కనబర్చడం లేదు. మీ ఓపెన్ ప్లాట్ ఎక్కడుంది? సరైన లొకేషన్ దొరకడం లేదు. ఇది చూపించేందుకు వస్తారా? అంటే.. అందుబాటులో లేమని, తర్వాత వచ్చి చూపిస్తామని కొందరు దరఖాస్తుదారుల నుంచి సమాధానం వస్తోంది. ఇంకొందరైతే అసలు ఫోన్ కాల్ రిసీవ్ చేయకపోవడంతో ఏం చేయాలో అధికారులకు తోచని పరిస్థితి ఉంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో 81,700 దరఖాస్తులు క్లియరెన్స్ కావాల్సి ఉంది. ఇందుకు 36 మంది సభ్యులతో కూడిన 12 బృందాలు పనిచేస్తున్నాయి. కొత్తగా వచ్చిన ఎల్ఆర్ఎస్ ఆఫీసర్ ఎల్-1 మొబైల్ యాప్ ద్వారానే అధికారులు ఈ దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. ఇంకోవైపు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తుదారుల సమస్యల నివృత్తి కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

రూ.200 కోట్ల ఆదాయం డౌటే...

గ్రేటర్ పరిధిలో ఎల్ఆర్ఎస్‌ద్వారా రూ.200 కోట్ల ఆదాయం రావాలని టార్గెట్ పెట్టుకున్నారు. 2020, ఆగస్టు 26 కటాఫ్ డేట్‌తో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. అంటే దాదాపు నాలుగేళ్లు కావడంతో ఇప్పటికే చాలామంది ఆ ఓపెన్ ప్లాట్లను ఇతరులకు విక్రయించుకునేవి సగానికిపైగా ఉన్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. అదేసమయంలో వరంగల్, ఖిలా వరంగల్, కాజీపేట, హనుమకొండ శివారు ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లలో ఇళ్లు దర్శనమిస్తుండడంతో సర్కార్ ఆశించిన రూ.200 కోట్లకుపైగా ఆదాయం రావడం అనుమానమేనని భావిస్తున్నారు. 'ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సమయంలో ఓపెన్ ప్లాట్లలో చెట్లపొదలు దర్శనమిస్తున్నాయి. కొలతలు తీసుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దరఖాస్తు చేసిన సమయంలో సదరు స్థలం జియో కోఆర్డినేట్స్ (ప్లాట్ ఎక్కడా ఉందో కచ్చితంగా గూగుల్‌లో చూపిస్తుంది) నిక్షిప్తం చేయకపోవడంతో లొకేషన్ దొరకడం లేదు. సదరు దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తే రేపు వస్తామంటూ ఫోన్ కట్ చేస్తున్నారు. ఇంకొందరైతే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు' అని బల్దియా టౌన్ ప్లానింగ్ డీసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు.

షిఫ్టింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లు పీజీ సీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లకు ఒక కేజీబీవీ నుంచి మరో కేజీబీవీకి షిఫ్టింగ్‌కు అవకాశం కల్పిస్తున్నామని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://స్కూల్ ఎడ్యు.తెలంగాణ.గౌట్.ఇన్/ఐఎస్ఎంఎస్/ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు ఈనెల 22 నుంచి 23 వరకు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఒకే కేజీబీవీలో రెండేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారు ఈషిఫ్టింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం.. షిఫ్టింగ్ ప్రక్రియ జరగనుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఖోఖో పోటీల్లో మనస్విని ప్రతిభ

- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థిని



నగదు పురస్కారం అందుకుంటున్న మనస్విని

దేవరుప్పుల : రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా ఖోఖో పోటీల్లో మండలంలోని కోలుకొండకు చెందిన ముత్యాల మనస్విని ప్రతిభ కనబరిచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మితో ప్రశంసలు అందుకుంది. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ క్రీడోత్సవాల్లో రామంతాపూర్‌లోని సత్యసాయి విద్యానికేతన్‌లో పదో తరగతి చదువుతున్న మనస్వినికి ఖోఖో విభాగంలో పాల్గొనే అవకాశం లభించింది. ఇందులో ప్రతిభకనబర్చడంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి చేతుల మీదుగా రూ.12 వేల చెక్కుతోపాటు ప్రశంస పత్రం అందుకుంది. దీనిపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

25న అండర్-9 చెస్ టోర్నీ


వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన అండర్-9 ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా తెలిపారు. హనుమకొండ 4వ డివిజన్‌లోని మాదిరెడ్డికుంటలోని 'రోజ్‌రీ' హైస్కూల్‌లో నిర్వహించనున్న టోర్నమెంట్ వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి01, 2015 తర్వాత జన్మించి ఉండాలన్నారు. క్రీడాకారులు తమ వెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలన్నారు. ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రోజ్‌రీ స్కూల్ డైరెక్టర్ అల్లం సునీల్‌రెడ్డి, నిర్వాహకులు ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేలిమి బంగారం ఇస్తానని మోసం..

- వ్యక్తిపై కేసు నమోదు

చిల్పూరు: అతి తక్కువ ధరకు మేలిమి బంగారం ఇస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన గడ్డమీది రమేశ్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత జూన్‌లో ఓ అపరిచిత వ్యక్తి రమేశ్‌కు ఫోన్ చేశాడు. 'నువ్వు నాకు బాగా తెలుసు.. నీ ఆటోలో ఎన్నో సార్లు ప్రయాణం చేశా.. అప్పుడే నీ ఫోన్ నంబర్ తీసుకున్నా' అని తెలిపాడు. తన వద్ద బంగారపు గుండ్లు ఉన్నాయని, తమిళనాడులోని పెనుసముద్రం వచ్చి తీసుకెళ్లమని చెప్పాడు. మొదటి సారి అక్కడికి వెళ్లగా రెండు గుండ్లు ఇచ్చాడు. వాటిని గ్రామానికి తీసుకొచ్చి తెలిసిన వారికి చూపించగా మేలిమి బంగారమని తేలింది. తిరిగి జూలై 14న ఆ అపరిచిత వ్యక్తి రమేశ్‌కు మరోసారి ఫోన్ చేసి రూ. 18 లక్షల విలువైన బంగారపు గుండ్లు ఉన్నాయని, అందుకు రూ. 4 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. ఈ మాటలు నమ్మిన రమేశ్ డబ్బు చెల్లించి వాటిని తీసుకొచ్చి తెలిసిన వారికి చూపించగా నకిలీ బంగారంగా తేలింది. వెంటనే అపరిచిత వ్యక్తి నంబర్‌కు ఫోన్ చేయగా పనిచేయకపోవడంతో మంగళవారం బాధితుడు రమేశ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, తాను డబ్బులు చెల్లించే క్రమంలో ఒక్కొక్క వ్యక్తి రూట్ మార్చారని, ఇలా నలుగురు రూట్ మార్చిమార్చి ఘటనాస్థలికి తీసుకెళ్లారని బాధితుడు రమేశ్ తెలిపారు. అనంతరం వారే డబ్బులు తీసుకుని తనకు నకిలీ బంగారం ఇచ్చారని పేర్కొన్నారు.

డిగ్రీ.. నో డిమాండ్



సగానికిపైగా సీట్లు ఖాళీయే..

- కేయూ 'డిగ్రీ' కళాశాలల్లో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి
- మొత్తం 1,03,590సీట్లలో 40,232 భర్తీ
- దోస్త్ ద్వారా 3దశలు, ఒక స్పెషల్ ఫేజ్ కూడా పూర్తి
- స్పెషల్‌డ్రైవ్‌గా మరోసారి అడ్మిషన్ల ప్రక్రియపై ఆశలు

విద్యార్థులు ఇంజనీరింగ్, వృత్తి విద్య లాంటి జాబ్ ఓరియంటెడ్ కోర్సుల వైపే ఆసక్తి చూపుతున్నారు. సంప్రదాయ డిగ్రీపై అనాసక్తి చూపుతున్నారు. పేరెన్నిక గల ప్రైవేటు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ మరికొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అంతంత మాత్రంగానే అడ్మిషన్లు అయ్యాయి. ఈపదాది కూడా డిగ్రీ



అడ్మిషన్ల సంఖ్య తగ్గింది. కొన్ని కళాశాలల్లోనైతే పలు కోర్సుల్లో వేళ్లమీద లెక్కపెట్టేంత 10 నుంచి 15 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సీట్లు సగానికిపైగానే ఖాళీగా ఉన్నాయి. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ,బీకాం కంప్యూటర్స్ లైఫ్ సైన్సెస్ తదితర కాంబినేషన్లతో వివిధ కోర్సులు కూడా ఉన్నాయి. కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 292 (ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, అటానమస్) డిగ్రీ కళాశాలలున్నాయి. అందులో 1,03,590 సీట్లు ఉన్నాయి. దోస్త్ ద్వారా 2024–2025 విద్యాసంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ఆయా కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. మూడుదశల్లోనూ, ఒక స్పెషల్ ఫేజ్‌లో కూడా కలిపి అడ్మిషన్లు జరగగా కేవలం 40,232 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. విద్యార్థులు ఎక్కువ ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్యాకోర్సుల వైపు ఆసక్తి చూపుతున్నారు. సాంప్రదాయక డిగ్రీ కోర్సుల వైపు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది . దీంతో సీట్లు భారీగా మిగిలిపోయాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లా కళాశాలల్లో ప్రవేశాలు ఇలా..

కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్ల భర్తీ చూస్తే కొన్ని కళాశాలలు పర్వాలేదనిపించింది. మరికొన్నికళాశాలల్లో తక్కువగానే సీట్లు భర్తీయ్యాయి. ప్రధానంగా అటానమస్ కాలేజీలో కొంత మెరుగ్గానే సీట్లు భర్తీయ్యాయి.హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో (అటానమస్) 1,560సీట్లు ఉండగా 1380 సీట్లు భర్తీ అయి టాప్‌లో నిలిచింది. యూనివర్సిటీఆర్ట్స్అండ్ సైన్స్‌కాలేజీ(అటానమస్) 1,770 సీట్లకుగాను 896 సీట్లు భర్తీఅయ్యాయి.ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో 1,080 సీట్లకుగాను 542 సీట్లు భర్తీఅయ్యాయి.నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)420 సీట్లకుగాను 395 భర్తీ అయ్యాయి.

స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్ల ప్రక్రియపై ఆశలు

దోస్త్‌ద్వారా డిగ్రీ కళాశాలల్లో ఇప్పటి వరకు మూడు దశలు, ఒకస్పెషల్ ఫేజ్ ప్రక్రియ కూడా ముగిసింది. ఇప్పటికే కళాశాలల్లో మొదటి సెమిస్టర్ తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. చివరిగా మరో స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నత విద్యామండలి నుంచి దీనిపై త్వరలోనే ప్రకటన వెలువడుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఎందుకంటే ఎప్‌సెట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది అందులో ఏమైనా సీట్లు రాని విద్యార్థులుంటే వారు, అలాగే తాము కోరుకున్న కళాశాలల్లో సీట్లు రాని విద్యార్థులు కూడా డిగ్రీ కళాశాలల్లో చేరే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. వారు కూడా అంతంతమాత్రంగానే ఉండే అవకాశం ఉంది.

సీట్ల కేటాయింపు.. భర్తీ ఇలా

కేయూ పరిధిలోడిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా మొదటిదశలో 16,486సీట్ల కేటాయింపులు జరగగా 9,608 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు.రెండోదశలో 8,605సీట్ల కేటాయింపులు జరగగా అందులో 5,659మంది, మూడోదశలో 18,102సీట్లు కేటాయింపులు చేయగా 14,805మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత స్పెషల్ ఫేజ్‌గా అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు.10895 సీట్లు కేటాయించారు.ఈ నెల 13వతేదీ వరకు సీట్లు కేటాయించిన వారికి కళాశాలల్లో రిపోర్టింగ్‌కు అవకాశం ఇచ్చారు.అందులో 10,160మంది విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. మొత్తం 54,088 సీట్లు కేటాయించగా అందులో 40,232 సీట్లు మాత్రమే భర్తీఅయ్యాయి.

మరో అవకాశం ఇవ్వాలనే యోచన

రాష్ట్రంలో దోస్త్‌ద్వారా డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు మరో అవకాశం ఇవ్వాలనే యోచన ఉంది. ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తియ్యాక స్పెషల్‌డ్రైవ్‌గా డిగ్రీ అడ్మిషన్లకు అవకాశం ఇస్తాం. ఇప్పటికే వివిధ కళాశాలల్లో పలు కోర్సుల్లో అతితక్కువ మంది విద్యార్థులు చేరిన పరిస్థితి కూడా ఉంది. ఏదైనా కళాశాలలో ఒక కోర్సులో 10 మంది విద్యార్థులు లోపు మాత్రమే ప్రవేశం పొందితే ఆ కోర్సు నుంచి వేరే కోర్సుకు మార్పు చేసుకునేందుకు కూడా అవకాశం ఇస్తున్నాం

– ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, చైర్మన్, ఉన్నత విద్యామండలి

అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడి గుడ్లు



గుండ్ల సింగారం అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చిన కుళ్లిన గుడ్లు

హసన్‌పర్తి: నగరంలోని గుండ్లసింగారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు కుళ్లిపోయిన కోడి గుడ్లు ఇచ్చారు. వీటిని తామెలా తినాలని గర్భిణులు, బాలింతలు ప్రశ్నిస్తున్నారు. చిన్న సైజు కోడి గుడ్లను ఇస్తున్నారని గర్భిణులు పేర్కొంటున్నారు. పాడైన గుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఇదే విషయమై సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని తిరుపతి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న గుడ్లపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని తిరుపతి డిమాండ్ చేస్తున్నారు.

బంగారు మైసమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



హన్మకొండ కల్చరల్ : హైదరాబాద్‌లోని తిలక్‌రోడ్‌లో గల దేవాదాయధర్మాదాయ శాఖ ముఖ్య కార్యాలయ ప్రాంగణంలో బుధవారం బంగారు మైసమ్మ బోనాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, అదనపు కమిషనర్లు కురాకుల జ్యోతి, ఎంఎండీ కృష్ణవేణి పాల్గొన్నారు. శ్రీభద్రకాళి దేవాలయం తరఫున ఈఓ శేషుభారతి మైసమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పించారు.

బాల బ్రహ్మస్వామి ధార్మిక ప్రవచనం

వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయాన్ని బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళంలో నైమిశారణ్య పీఠానికి చెందిన బాలబ్రహ్మస్వామి సందర్శించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులనుద్దేశించి ధార్మికప్రవచనాలు చేశారు.

వైభవంగా పొట్ట పండుగ

- సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు
- గద్దెల వద్ద జాగారాలు



అమ్మవారిని తీసుకెళ్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో ఫిబ్రవరిలో జరిగిన సమ్మక్క,సారలమ్మ మహాజాతర అనంతరం ఆరు నెలల తర్వాత బుధవారం అమ్మవార్ల పొట్టపండుగ వైభవంగా నిర్వహించారు. మేడారంలోని సమ్మక్క గుడిని పూజారులు శుద్ధి చేశారు. ఆడపడుచులు గుడిలో ముగ్గులు వేసి అలంకరించారు. అమ్మవార్ల గద్దెలు, ప్రధాన ఆర్చీ ద్వారానికి మామిడి తోరణాలు కట్టారు. రాత్రి సమయంలో సమ్మక్క గుడి నుంచి పసుపు, కుంకుమ, పూజ సామగ్రి తీసుకుని, సమ్మక్క పూజారులు, వడ్డెలు డోలు వాయిద్యాలతో అమ్మవార్ల గద్దెల వద్దకు వెళ్లారు. సమ్మక్క గుడి నుంచి పూజారులు గద్దెలకు వెళ్తున్న క్రమంలో శుభం కలగాలని యువతి, యువకులు వరంపట్టగా పూజారులు వారిపై నుంచి దాటుకుంటూ వెళ్లారు. గుడికి వెళ్లే దారిలో ఆదివాసీ మహిళలు పూజారులకు నీళ్లు అరగించారు. గద్దెలకు వెళ్లే ముందు చిలకలగుట్టకు వెళ్లే దారి వద్ద మూడుసార్లు పూజారులు సంప్రదాయప్రకారం అమ్మవారికి మొక్కుకున్నారు. కాగా, జలగం వడ్డె మల్లెల ముత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన స్థానంలో తన సోదరుడు మల్లెల సత్యంను జలగం వడ్డెగా నియమించారు.

రహస్య పూజ కార్యక్రమాలు

సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్దకు చేరుకున్న పూజారులు గద్దెలను అలికి పసుపు, కుంకుమలతో ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు రహస్య పూజలు నిర్వహించి తల్లుల గద్దెల ప్రాంగణంలో పూజారులు రాత్రింతా జాగారాలతో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్ధబోయిన మునీందర్, కొక్కెర కృష్ణయ్య, సిద్ధబోయిన మహేశ్, భోజరావు, సిద్ధబోయిన స్వామి, వసంతరావు, సిద్ధబోయిన అరుణ్‌కుమార్, జనార్దన్, దూప వడ్డె నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వనదేవతల గద్దెల నుంచి సమ్మక్క గుడికి..

బుధవారం రాత్రింతా అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో జాగారాలతో సంబురాలు చేసుకున్న పూజారులు, ఆదివాసీ యువకులు నేడు(గురువారం) ఉదయం సూర్యుడు ఉదయించక ముందు సమ్మక్క తల్లి గద్దెపై నుంచి పూజ సామగ్రి, ధాన్యాలు తీసుకుని పూజారులు సమ్మక్క గుడికి వెళ్లనున్నారు. గుడిలో పొట్ట పండుగ పూజలు నిర్వహించి కూరగాయలు, ధాన్యం, మొక్కజొన్న కాంకులను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించనున్నారు.

పటిష్టం దిశగా సీపీఐ

- నేటినుంచి మూడు రోజులపాటు పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు
- హనుమకొండ హరిత కాకతీయలో ఏర్పాట్లు పూర్తి
- ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్
- డి.రాజా, నారాయణతోపాటు పలువురు అగ్రనేతల రాక



గోడలపై రైటింగ్

న్యూశాయంపేట: సీపీఐకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. నిరంతరం ప్రజల్లో ఉంటూ.. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ పరపతి పెంచుకునేందుకు ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా.. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో గత నెల 3 నుంచి 11వ తేదీ వరకు జిల్లా మహాసభలు నిర్వహించింది. పార్టీ బలం పెంచుకోకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో ముందుకు సాగలేమని నాయకత్వం భావిస్తోంది. కలిసొచ్చే పార్టీలతో పొత్తులు కొనసాగిస్తూ.. తమ బలాన్ని నిరూపించుకోవాలనుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించింది. గురువారం నుంచి మూడు రోజులపాటు జరిగే సమావేశాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నగరం జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్‌లతో ఎరుపెక్కింది. సమావేశాలు జరిగే హరిత కాకతీయ ప్రాంతంలో జాతీయ రాష్ట్ర నాయకులకు స్వాగతం పలుకుతూ భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పోరుగడ్డలో పార్టీ నిర్మాణ మహాసభలు

పోరాటాల పురిటిగడ్డ వరంగల్ నుంచే తమ భవిష్యత్ కార్యాచరణ చేపట్టాలని పార్టీ భావిస్తోంది. ఈ మేరకు గురువారం నుంచి (ఈ నెల 22, 23, 24 తేదీల్లో) మూడు రోజులపాటు హనుమకొండలో రాష్ట్ర పార్టీ నిర్మాణ మహాసభలు జరగనున్నాయి. ఈ మహాసభల్లో పార్టీ నిర్మాణం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులు చర్చించనున్నారు. ఇక్కడి నుంచే తమ పోరాట పంథాను అగ్రనేతలు ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు 'సాక్షి'తో తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితర నేతలు హాజరు కానున్నట్లు చెప్పారు.

అలుపెరుగని పోరాటాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం ఉద్యమాలు చేస్తూ.. పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చింది. పలుప్రాంతాల్లో భూపోరాటాలు చేసి పేదలతో గుడిసెలు వేయించింది. చాలాచోట్ల అందులోనే పేదలు నివాసం ఉంటున్నారు. తెలంగాణ విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, యువతకు ఉపాధి అవకాశాల కోసం భారీ పరిశ్రమల స్థాపన కోసం ఉద్యమాలు చేపడుతూ సీపీఐ ముందుకు వెళ్తోంది.

రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివి

- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

పర్వతగిరి : ఆర్‌డీఎఫ్ విద్యా సంస్థల ఫౌండర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ కళాశాల ఆవరణలో బుధవారం ఉపాధ్యాయుల సముదాయ భవనాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు కళాశాల విద్యార్థులు అర్చరీ విద్య ప్రదర్శించగా తిలకించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అర్చరీ బాణాలు వదిలారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు తండ్రి వెంకట నర్సయ్య పెద్ద భూస్వామి అని, ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ మొదటి చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా పని చేశారన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు ఎన్నో సేవా కా ర్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండాలనే సంకల్పంతో వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించడానికి ముందే రామ్మోహన్‌రావు కల్లెడ గ్రామంలో స్వచ్ఛందంగా వ్యక్తిగత వెస్ట్రన్ మరుగుదొడ్లు నిర్మించి వృద్ధులు, దళితులు, వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచారని తెలిపారు. రామ్మోహన్‌రావు ఏబీవీ పీలో పని చేసినప్పటి నుంచి తనకు తెలుసని, ఇద్దరం కలిసి జైలుకు వెళ్లిన ఘటనలు గుర్తు చేసుకున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు తనకు సుపరిచితుడని, ఆయన ఎన్నో సేవలు చేశారన్నారు. ఆర్‌డీఎఫ్ విద్యా సంస్థల ఫౌండర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, అనంతసాయ్, ఆర్‌డీఎఫ్ సెక్రటరీ వెంకటకిరణ్, ఆర్‌డీఎఫ్ ప్రిన్సిపల్ ఆడెపు జనార్దన్,హైస్కూల్ ప్రిన్సిపల్ అశోకాచారి, తదితరులు పాల్గొన్నారు.

భార్య, పిల్లలను తీసుకొచ్చేందుకు వెళ్తూ మృత్యుఒడికి..

- లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం
- గోవర్ధనగిరి వద్ద ఘటన

రఘునాథపల్లి: రాఖీ పండుగకు పుట్టింటికి వెళ్లిన భార్య, పిల్లలను తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన హనుమకొండ, హైదరాబాద్ జాతీయ రహదారిపై గోవర్ధనగిరి వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన నక్కల ఉపేందర్ (39), హైమావతి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రాఖీ పండుగ సందర్భంగా ఈ నెల 19న హైమావతి పిల్లలతో కలిసి మీదికొండలోని పుట్టింటికి వెళ్లింది. బుధవారం భార్య, పిల్లలను తీసుకొచ్చేందుకు ఉపేందర్ తన ద్విచక్రవాహనంపై మీదికొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో గోవర్ధనగిరి వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ఉపేందర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు శివప్రసాద్, కుమార్తె కావ్యశ్రీ ఉన్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- 7తులాల బంగారం, రూ. 15వేల నగదు స్వాధీనం




నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ రమేశ్, పోలీసు అధికారులు

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండలం దండేపల్లిలో గత నెలలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి 7 తులాల బంగారం, రూ. 15వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పులి రమేశ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు కోదాటి ప్రమీళ గత నెల జూలై 2న పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వెళ్లింది. డబ్బులు తీసుకుని ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నగలు, డబ్బు చోరీకి గురైనట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించిన పోలీసులు అదే గ్రామానికి చెందిన నిందితుడు నాయినేని కనకరావును అరెస్టు చేసి 7 తులాల బంగారం, రూ. 15వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ పులి రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గోదారి రాజ్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, సిబ్బంది కృష్ణమోహన్, భాస్కర్, మల్లేశ్, సదానందం, రాజయ్య, రాజు, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి.. విషజ్వరంతో ఆస్పత్రిపాలైన తల్లి

- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాలింత
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు
- ఇప్పటికే వైద్యానికి రూ.7లక్షల వరకు ఖర్చు





మమత కుమారుడు చికిత్స పొందుతున్న మమత

కేసముద్రం: బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి.. విషజ్వరం, లివర్ ఇన్‌ఫెక్షన్‌కు గురై ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. పుట్టిన బిడ్డ ఆలనాపాలన చూడాల్సిన ఆ తల్లి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామశివారు చెరువుకొమ్ముతండాకు చెందిన ధారావత్ జ్ఞాని, పద్మ దంపతులకు కుమార్తె మమత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడాది క్రితం చెట్లముప్పారం గ్రామ శివారు పెద్ద తండాకు చెందిన బాలాజీతో మమతకు వివాహం చేశారు. కాగా, గత నెల 27న మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మమత పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. కాగా, డిశ్చార్జి అనంతరం తల్లి, బిడ్డలను కుటుంబ సభ్యులు చెరువుకొమ్ముతండాకు తీసుకువెళ్లారు. ఈ క్రమంలో వారం క్రితం మమతకు జ్వరం రావడంతో మానుకోటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం తరలించగా, అప్పటికే జ్వరంతోపాటు, కామెర్లతో లివర్ ఇన్‌ఫెక్షన్ అయినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికే వైద్యానికి రూ.7లక్షలకు పైగా ఖర్చు అయింది. దీంతో చేతిలో చిల్లి గవ్వలేకపోవడంతో ఏంచేయాలో తెలియక కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవైపు పుట్టిన పసికందును చూడలేని స్థితిలో ఆ తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం అందరిని కలిచివేస్తోంది. దీనిపై దాతలు పెద్దమనసుతో స్పందించి తమ బిడ్డ మమతను ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. 9701059077 నంబర్‌కు ఫోన్ చేసి చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, ఇప్పటికే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

పోడు భూములకు శాశ్వత పట్టాలివ్వాలి

హన్మకొండ: పోడు భూములకు శాశ్వత పట్టాలివ్వాలని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ సలహాదారు గుండాల నర్సయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు సినపల్లి కొంరయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన పంచరాయి, అసైన్డ్, ఇనాం భూములను సర్వే చేయించి కబ్జాలో ఉన్న వారికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టులను సీనియార్టీ ద్వారా భర్తీ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన డబుల్ బెడ్ రూములను అర్హులకు వెంటనే ఇవ్వాలని, ఇల్లు లేని వారికి ఇంటి స్థలాలు ఇచ్చి నిర్మాణానికి డబ్బులు ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం ఉన్న దళితులకు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలకే దళితులకు ఆసరా పెన్షన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి పసునూరి మనోహర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రడపాక పరంజ్యోతి, నాయకులు ఎర్ర చంద్రమౌళి, లింగాల ఇమ్మానియేల్, సోమారపు వీరస్వామి, ఎనగందుల కుమార్, శంకర్, నిరంజన్, తాళ్లపల్లి థామస్, గుర్రపు యాదగిరి, అశోక్, కొంరయ్య, ప్రభాకర్, యాకయ్య పాల్గొన్నారు.